అవుట్ సోర్సింగ్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గురుకుల పాఠశాల, కళాశాలల్లో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ బోధన పోస్టులు ఖాళీలు భర్తీ చేయడానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పిఒ కల్పనా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16లోగా బాలుర గురుకుల కళాశాలకు దరఖాస్తులు ఇవ్వాలని తెలిపారు. డిగ్రీ, పీజీ, టెట్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. స్థానిక బాలుర, బాలికల గురుకుల కళాశాలలో ఫిజిక్స్ పోస్టులు, బాలుర గురుకుల పాఠశాలలో సైన్స్, బాలికల పాఠశాలలో సోషల్, మల్లి గురుకుల పాఠశాలలో సోషల్ పోస్ట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. వీటి భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు.

పూతకు రాని జీడిమామిడి

పగబట్టిన ప్రకృతి

- వైపరీత్యాలతో పంటలకు నష్టం
- తుపానుకు నీటిపాలైన వరి
- నాలుగేళ్లుగా దిగుబడి లేని జీడి
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యంలో గత నాలుగేళ్లుగా ప్రకృతి గిరిజన రైతులపై పగబట్టింది. ఏదో ఒక రూపంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తూ పంటలకు తీవ్ర నష్టం కలిగించి రైతులను కష్టాల పాలు చేస్తుంది. ఈ ఏడాది వర్షభావ పరిస్థితులు వల్ల గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో వరి పంటకు నష్టం వాటిల్లడంతో కరువు ఛాయలు అలమకున్నాయి. జీడిపంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న గిరిజనులకు కారు మబ్బులతో జీడిపంట దిగుబడి కానరావడం లేదు. మైదాన ప్రాంతాలైన జియమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో తుపాను కారణంగా వరి, పత్తి పంటల్లో నీరు చేరడంతో అవి పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. వీటికి తోడు అడవి ఏనుగుల సంచారంతో వరి, అరటి, పత్తి ,మొక్క జొన్న పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తు న్నాయి. ప్రతి ఏడాది పంటల మదుపులకు వేలాది రూపాయలు అప్పులు చేస్తున్నా రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఏడాదంతా కష్టపడి సాగు చేసిన పంట చేతికి అంద డంలేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

జీడి పంట ఆదుకునేనా?

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 50,472 ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఒక్క గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే సుమారు 35వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ప్రతి ఏటా 10వేల నుంచి 12వేల క్వింటాళ్ల వరకు జీడి పంట దిగుబడి వస్తుందని అంచనా. అయితే గత నాలుగేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల కారణంగా పంటపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏటా చెట్లు పూతకు వచ్చే డిసెంబర్ నెలలోనే అధికంగా టీదోమ ఆశిస్తుంది. ఉద్యాన శాఖ అధికారులు ముందుగానే రైతులకు తెగుళ్లపై అవగాహనా కల్పించి సస్యరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా అది ఎక్కడ కానరావడం లేదు. ఫిబ్రవరి, మార్చిలో గుర్తించడంతో పంటపై తీవ్ర ప్రభావం చూపి పూత, పిందె నిలబడకుండా పంటను సర్వనాశనం చేస్తున్నాయి. 1990 నుంచి 2015 వరకు ఐటిడిఎ, హార్టికల్చర్ ద్వారా 90 శాతం రాయితీపై కొమ్మలు కత్తిరించే పరికరాలు, మందులు, స్ప్రేయర్లు అందించేవారు. ప్రస్తుతం ఎలాంటి రాయితీలు లేకపోవడంతో భారం పడుతుందని గిరిజనులు రైతులు వాపోతున్నారు. గిరిజన రైతులు పండించే జీడి పంటకు మద్దతు ధర కల్పించేందుకు గుమ్మ లక్ష్మీపురం, కురుపాం, సాలూరు, మక్కువ మండలాల్లో రూ.6 లక్షలు చొప్పున వెచ్చించి జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. రూ.2 లక్షలు ఖర్చుతో ఆయా కేంద్రాలకు సామాగ్రి కొనుగోలు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎక్కడా కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో జీడి పంటను రైతులు ప్రైవేటు వర్తకులకు అమ్ముకోవాల్సి వస్తుంది. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. గత ఏడాది గుమ్మలక్ష్మీపురం మండలం జెకె పాడులో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేసినా అది నోచుకోలేదు.

వర్షాలకు నీటమునిగిన వరి పంట

తీవ్రంగా నష్టపోతున్నారు

జీడి పంట పూత సమయంలో ఎక్కువగా తేనెమంచు ప్రభావం, టీ దోమ సోకడంతో గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి బాగా తగ్గింది. ప్రధాన పంట అయిన జీడి పంటనే నమ్ముకుని వేలాదిమంది రైతులు జీవనం సాగిస్తున్నారు. పంట దిగుబడి ఆశించిన ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఐటిడిఎ అధికారులు గుర్తించి రైతులకు సబ్సిడీపై క్రిమిసంహారక మందులు పంపిణీ చేయాలి.

మండంగి రమణ,
ఎంపిటిసి, చెముడుగూడ

నష్టపరిహారం ఇవ్వాలి

ఈ ఏడాది కరువు ప్రభావంతో వరి పంట నష్టపోయిన గిరిజన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలి. ప్రధాన ఆధారమైన జీడి పంటను ప్రోత్సహించి, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు తెరిచి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. వ్యవసాయ యాజమాన్య పద్ధతుల్లో జీడి పంటలపై అవగాహన కల్పించాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

రైతులను ఆదుకోవాలి

వరితో పాటు ఇతర పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. నష్టాలపై సర్వే చేసి పరిహారం చెల్లించాలి. జీడి పంట రైతులకు తెగుళ్ల నివారణపై అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలి.

నందివాడ కృష్ణబాబు,
టిడిపి అరకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి

జెండా ఊపి ఆటోలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మహిళల ఆర్థిక పరిపుష్టికి ఊతం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక పరిపుష్టి సాధించేలా ప్రభుత్వం ఊతం అందిస్తుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉన్నతి మహిళా శక్తి పథకం కింద మహిళలకు కలెక్టరేట్‌లో శనివారం ఆటోలను పంపిణీ చేశారు. అనంతరం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు ఆత్మస్థైర్యంతో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న ఉన్నతమైన ఆశయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆటో నడుపుకొని వచ్చిన ఆదాయంతో జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని సూచించారు. స్వయంశక్తి సంఘాల్లోని అర్హత కలిగిన షెడ్యూల్ తెగలు, కులాలకు చెందిన మహిళలకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేని రుణాలతో ఆటోలను పంపించేస్తున్నామన్నారు. జిల్లాకు 8 ఆటోలు మంజూరు కాగా, ప్రస్తుతం ఐదు ఆటోలు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. లబ్ధిదారులకు రూ.3 లక్షలు వరకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నామన్నారు. ఒక్కో లబ్దిదారు పది శాతం వాటాను మూలధనంగా పెట్టుబడిపెట్టి నెలసరి వాయిదా కింద రూ.6,200 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి వారధి

- గిరిజన, మైదాన ప్రాంతాల్లో వంతెనలు
- దశాబ్దాల ఏజెన్సీ వాసుల కష్టాలకు తెర
- అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు మార్గం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో గిరిజన, మైదాన ప్రాంతాల మధ్య రహదారుల్లో వాగులు, వంకలు, నదులపై వంతెనల నిర్మాణంతో దశాబ్దాల రవాణా కష్టాలకు తెర పడింది. ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ ఏర్పడిన రహదారుల మధ్యలో వంతెనలు, కాజ్‌వేలు లేక గిరిజనులు, మైదాన ప్రాంత రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండేది. అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసుకోలేక గిరిపుత్రులు వాటిని గ్రామాల్లోనే తక్కువ ధరలకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి కనిపించేది. అలాంటి దుస్థితి నుంచి గిరిజనులు సులభంగా తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా చేసుకునేందుకు మార్గం సుగమమైంది. మండలంలోని కందులపథం వంతెన లేక ఆ ప్రాంతంలో ఉన్న భూస్వాములు, గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కాజ్‌వే మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి వుండేది. సుమారు 20 గిరిజన గ్రామాలకు వారధిగా ఉండేలా వంతెన నిర్మాణమైంది. రూ.5.5 కోట్లతో పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ పర్యవేక్షణలో వంతెన నిర్మించడంతో రవాణాతో పాటు రాకపోకలు సాగిస్తున్నారు. పామాయిల్, మొక్కజొన్న, పత్తి వంటి వాణిజ్య పంటలతో పాటు అటవీ ఉత్పత్తుల రవాణా ఇప్పుడు సులువైంది. ఏడాది క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర ఈ వంతెనను ప్రారంభించారు. సుమారు వంద కోట్ల రూపాయల నిధులతో వంతెనలు, కాజ్‌వేల నిర్మాణం జరుగుతోంది. వీటిలో కొన్ని పూర్తవ్వగా, మరికొన్ని నిర్మాణదశలో ఉన్నాయి. సాలూరు పట్టణానికి సమీపంలో ఉన్న కాకులతోట వద్ద వట్టిగెడ్డ నదిపై వంతెన నిర్మాణంలో ఉంది. 80శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ వంతెన నిర్మాణంతో సాలూరు, పాచిపెంట మండలంలోని ఎక్కువ గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తీరిపోయే అవకాశం ఉంది. వర్షాకాలంతో కాజ్‌వే మీదుగా ప్రయాణించాలంటే వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడిపేవారు. వంతెన నిర్మాణానికి ముందు ఎంతోమంది నదిలో స్నానానికి వెళ్లి కొట్టుకుపోయారు. అలాంటి పరిస్థితి నుంచి ఈరోజు రాకపోకలు సాగించేందుకు వంతెన సిద్ధంగా ఉంది. పిఆర్ ప్రాజెక్ట్ శాఖ పర్యవేక్షణలో రూ.50కోట్లతో పది వంతెనల నిర్మాణం జరుగుతోంది. పాచిపెంట మండలం మాతుమూరు -శీల గ్రామాల మధ్య రూ.9.8కోట్లతో వంతెన నిర్మాణంలో ఉంది. అదే రహదారిలో మరోచోట రూ.4.85కోట్లతో వంతెన నిర్మాణం సాగుతోంది. మోసూరుకు రాకపోకలు సాగించే రహదారి మధ్యలో వట్టిగెడ్డపై రూ.7.6కోట్లతో వంతెన నిర్మాణమైంది. కుంతాం రోడ్డు నుంచి మెట్టుగుడ్డి, శేరిగుడ్డి వెళ్లే దారిలో రూ.5.75కోట్లతో తుమ్మిగెడ్డపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదే దారిలో మరోచోట రూ.1.93 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తయింది. ఆలూరు నుంచి గాదిలమండ వెళ్లే రహదారిలో రూ.7.45 కోట్లతో వంతెన నిర్మాణం సాగుతోంది. సాలూరు మండలంలో వెలగవలస, ములక్కాయ వలస గ్రామాల మధ్య రహదారిలో రూ.8కోట్లతో వంతెన నిర్మాణంలో ఉంది. చినబోరబంద రోడ్డు నుంచి పారన్నవలస రహదారిలో రూ.1.38కోట్లతో కాజ్‌వే నిర్మాణపనులు జరుగుతున్నాయి. దండిగాం నుంచి కురుకుట్టి వెళ్లే రహదారిలో కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన పనులు టెండర్ దశలో ఉన్నాయి. భారీ వర్షాలు పడినప్పుడల్లా దండిగాం, కురుకుట్టి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ ప్రాంతంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి జాడలు కనిపిస్తుండడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వంతెనల నిర్మాణం వల్ల అటవీ ఉత్పత్తుల రవాణాకు అడ్డంకులు తొలగిపోయాయనే అభిప్రాయంతో ఉన్నారు.

పాచిపెంట మండలం మోసూరు వద్ద వట్టిగెడ్డపై నిర్మించిన వంతెన

సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత

డిప్యూటీ సిఎం రాజన్నదొర

నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులు కూడా త్వరితగతిన జరుగుతున్నాయి. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. రూ.వంద కోట్లపైనే నిధులతో వంతెనలు కాజ్ వేలు నిర్మాణంలో ఉన్నాయి. దశాబ్దాల రహదారి కష్టాలకు వంతెనల నిర్మాణంతో తెరపడుతుంది.

రాజీయే ఉత్తమ మార్గం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కేసులు సత్వర పరిష్కారానికి రాజీ మార్గం అనుసరించడమే ఉత్తమ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞ నారాయణ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించుకొనేలా జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. ఇటువంటి అవకాశం కల్పించడం వల్ల కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు ఆదా చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని అన్నారు. లోక్‌అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రకుమార్, లోక్ అదాలత్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా అదాలత్ ద్వారా ఎపిసి కేసులు 66, ఎన్ఐ యాక్టు కేసులు 7, ఎక్సైజ్ 21, సివిల్ 15, ఫ్యామిలీ 6, ఎస్‌టిసి కేసులు 1514, ఫైన్‌కు సంబంధించిన కేసులు 103 పరిష్కారమయ్యాయి.

కురుపాం : కేసులు సత్వర పరిష్కారానికి రాజీ మార్గం అనుసరించడమే ఉత్తమ మార్గమని స్థానిక జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మద్ది రోహిణిరావు అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఎస్‌టిసి కేసులు 157, 336 ఐపీసీ అడ్మినిస్ట్రేషన్ కేసులు 20, లేబర్ కేసులు 2 పరిష్కరించామన్నారు. ఈ కేసుల్లో జరిమానా రూ.40వేలు విధించామని కేసులు త్వరితగతిన పరిష్కరించుకునేలా జాతీయ లోక్‌అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు బి.చంద్రమౌళి, ఐ.వాసుదేవరావు, న్యాయవాదులు పోలీసులు కక్షదారులు పాల్గొన్నారు.

సాలూరు: జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన అదాలత్‌లో 109 కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయమూర్తి కె.రమేష్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో 109 సివిల్, క్రిమినల్, మనోవర్తి, ఎక్సైజ్ కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు తాడ్డి తిరుపతి రావు, లోక్ అదాలత్ సభ్యులు నారాయణరావు పాల్గొన్నారు.

పార్వతీపురం : కక్షిదారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ

కురుపాం : కక్షిదారులతో మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రోహిణీరావు

ఇద్దరు సిఐలకు బదిలీ

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లాలోని పాలకొండ, చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలయ్యాయి. ఈ మేరకు విశాఖ రేంజ్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. బదిలీల్లో భాగంగా పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మురళీధర్ చిన్నమేరంగి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడికి విశాఖ పట్టణం రేంజ్ కార్యాలయంలో ఉన్న చంద్రమౌళి పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఈయన ఇక్కడే ఎస్సైగా పని చేసి శాంతభద్రతలు పర్యవేక్షణలో తనదైన ముద్ర వేసుకున్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం ప్రిన్సిపల్ జె.రామారావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాజకీయాలను మలుపు తిప్పి మంచి పాలకులను ఎన్నుకునేందుకు యువత ముందుకు రావాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగంపై పూర్తి అవగాహన కలిగి రాజ్యాంగ విలువలను పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌పిఒలు తెర్లి రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, డి.తవిటి నాయుడు, అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, డి.లక్ష్మణరావు, ఎం సత్యనారాయణ, టి శ్రీధర్ పాల్గొన్నారు.

పాలకొండ: ఓటు హక్కు అందరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలుర ప్రిన్సిపల్ పైల శంకరరావు అన్నారు. స్వీప్ 2024 కార్యక్రమంలో భాగంగా స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తేజేశ్వరరావు, గోవిందరావు, నారాయణరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శివానంద, నాగభూషణరావు, జె.రాజు, గిరిబాబు, రామారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అప్పారావు తదితరులున్నారు.

పార్వతీపురం : ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎన్నికల ప్రణాళిక కోసం చర్చించినట్లు కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. అరుకు పార్లమెంట్ అధ్యక్షుడిగా ఎన్నికైన కిడారి శ్రావణ్ ఆధ్వర్యంలో అరుకు పార్లమెంట్ పరిధిలో ఉన్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో విశాఖపట్నంలో సమావేశమైనట్లు ఆమె తెలిపారు. కురుపాం నియోజకవర్గంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తుందన్నారు. టిడిపికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించానని అన్నారు. అనంతరం కిడారి శ్రావణ్ ను ఇంచార్జిల తో కలిసి సన్మానించామని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి, ఉత్తరాంధ్ర జిల్లాల కో - ఆర్డినేటర్ దామిచెర్ల సత్య, ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల ఇన్చార్జులు నిమ్మక జయకృష్ణ, బోనెల విజయచంద్ర ఉన్నారు.

నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

పంట నష్ట గణనకు మీనమేషాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పంట నష్ట గణనకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. విజయనగరం ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం తుపాను నేపథ్యంలో పంటల పరిశీలన పేరిట తెగేసి తిరిగేస్తున్నారు. ఆ పేరుతో తీసుకున్న ఫొటోలు, వీడియోల పరంపర సోషల్ మీడియాలో హల్‌చల్ చేయిస్తున్నాయి. బహుశా రైతులకు అండగా నిలిచామన్న భరోసా ఇవ్వదలచుకున్నారేమో. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేదన్నది రైతుల నుంచి వినిపిస్తున్న మాట. ఇందుకు కారణం లేకపోలేదు. పంటనష్ట గణనపై ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. దీంతో, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆ పనిలో లేరు. కనీసం పంటలు ఎంత మేర నీటిలో మునిగాయన్న అంచనాలు కూడా వ్యవసాయ శాఖ ఇవ్వలేదు. ఇదే విషయాన్ని సాక్షాత్తు వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారు. కానీ, రైతుల ఓదార్పు యాత్ర మాత్రం కొనసాగుతోంది. ద్వంద నీతిని ప్రజలు, ముఖ్యంగా రైతులు గమనిస్తునే ఉన్నారు. పంటనష్ట గణనపై ఇప్పటికీ అధికారులకు ఆదేశాలు అందకపోతే ప్రభుత్వంపై ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్ తదితర ప్రజాప్రతినిధులు ఎందుకు ఒత్తిడి చేయడం లేదో అంటూ రైతుల్లో చర్చనడుస్తోంది. కలెక్టర్ మాత్రం 9వ తేదీ నుంచి పంటనష్ట గణన ఉంటుందని చెప్పారు. చెరువులో చేపలు చెల్లిపోయాక కొంగలు వచ్చి ఏం చేస్తాయి అన్న సామెతలా పంటముంపును గుర్తించకుండా, నీరు తగ్గిపోయాక పొలాల్లో తలబడి లెక్కించేస్తామంటే నష్టం ఏమిటో ఎలా తెలుస్తుంది అని పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ సంగతి కాస్త పక్కనబెడితే జిల్లాలో తుపాను కారణంగా మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న, పత్తి, అపసరాల పంటలు నీట మునిగాయి. తీవ్ర నష్టం వాటిల్లింది. వాటిని కాపాడుకునేందుకు రైతుల యాతన వర్ణణాతీతం. పావలా వాటా కూడా చేతికందే పరిస్థితి లేదని కొందరు, 50శాతానికి మించి చేతికి వచ్చే పరిస్థితి లేదని ఇంకొందరు, ఆయా గ్రామాల్లో వరద ప్రభావాన్ని బట్టి చెబుతున్నారు. మరోవైపు అక్టోబర్‌లో ఏర్పడిన నీటి ఎద్దడి సుమారు లక్ష ఎకరాల్లో పంటలను ఎండబెట్టిన సంగతి తెలిసిందే. దీంతో, రైతుల పెట్టుబడి రెట్టింపు అయినా, దిగుబడి ఆశాజనకంగా వచ్చినా తుపాను వేసిన కాటుకు సగానికి సగం కూడా చేతికి అందని పరిస్థితి దాపురించింది. నీటి ఎద్దడి ఎదుర్కొన్న సమయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల నోట కరువు జిల్లాగా ప్రకటించాలన్న మాట రాలేదు. ఇప్పుడు పంటనష్ట గణనకు మీనమీషాలు లెక్కిస్తున్నా రైతుల ఆర్తనాదాలు ప్రభుత్వ చెవులకు ఎక్కించే ప్రయత్నం చేయలేదు. దీంతో, రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చడం తప్ప రైతులకు మేలు చేసేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఏమాత్రం ఒత్తిడి చేయలేదని, ప్రభుత్వం చెబుతున్న సాంతికేక కారణాల సాకులకు తలూపడమే మిగిలిందని జనం చర్చించుకుంటున్నారు. పైగా కోత కోసిన వరిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోబోదంటూ సాక్షాత్తు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్నదొర చేసిన ప్రకటన రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. వాస్తవానికి ఇప్పటికే 70శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఇందులోనూ ఎక్కువ భాగం ఇంకా పొలాల్లోనే ఉంది. అపార నష్టం వాటిల్లింది. తమకు బాధ్యత లేదన్నట్టు ప్రభుత్వం వ్యవహరించడం వెనుక రైతులను పంగనామాలు చూపించేందుకు ప్రయత్నించడమేనని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదే జరిగితే ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారని జనం నోట వినిపిస్తున్న మాట.


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిప్యూటీ డిఎంహెచ్ఒ డి.శివకుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికను తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం పిఎంఎంవివై గర్భిణీలు తనిఖీలు ఉండగా డాక్టర్ వెంకటరమణ సెలవు దరఖాస్తు పెట్టకుండా గైర్హాజరవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఇక్కడ నుంచి డిప్యూటేషన్‌పై పార్వతీపురం వెళ్లిన హెచ్‌వి, హెల్త్ అసిస్టెంట్ తిరిగి ఇక్కడే విధుల్లో చేరాలని రెండు నెలల క్రితం ఆదేశించినా ఇక్కడికి రాకుండా అక్కడ పనిచేస్తున్నా వారికి జీతాలు ఎలా చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ మరమ్మతులు పూర్తి చేయకపోవడం పట్ల ప్రశ్నించారు.

11 నుంచి సచివాలయ విధి విధానాలపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని 20 సచివాలయల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లకు ఈనెల 11నుంచి 16 వరకూ రెండు దఫాలుగా గ్రామ సచివాలయాల సేవలు, విధివిధానాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ జి.రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా మరిన్ని సేవలు అత్యంత పారదర్శకంగా అందించాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ వాలంటీర్లకు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

కురుపాం ఎస్‌ఐగా షణ్ముఖరావు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వి.షణ్ముఖరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ బత్తిలి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ కురుపాంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలతో మమేకమై గ్రామాల్లో యువత, ప్రజలకు మద్యపాన నిషేధం, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఫ్రెండ్లీ పోలీసుగా ఉంటామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలు పట్టుకొని హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి పోలీసులకు సహకరించాలని కోరారు.

సమ్మేళనంలో మాట్లాడుతున్న పడాల భూదేవి

భూదేవికి ఘన సన్మానం

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం ఆనందమయి ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన నారీశక్తి సమ్మేళన కార్యక్రమానికి నారీశక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూదేవి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతం నుంచి రాష్ట్రపతి అవార్డు అందుకొనే స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. అయితే అవార్డు లభించడం వెనక చాలామంది అనేక మంది ప్రోత్సాహం ఉందన్నారు. ఇప్పటికే మహిళాభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అలాగే సమాజంలో మహిళ పాత్ర కీలకమన్నారు. మెరుగైన సమాజం కోసం తల్లి తన పిల్లలను క్రమశిక్షణతో విద్యను అభ్యసించేలా చూడాలన్నారు. ముందుగా భూదేవికి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణులకు వైద్యతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తు, బరువు, మధుమేహం తదితర తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శాంతి కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

మనోహర్‌కు శాలువతో సత్కరిస్తున్న కద్రక మల్లేశ్వరరావు

నాదెండ్లను కలిసిన మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉమ్మడి విజయన గరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం జనసేనా కార్యాలయం ప్రారంభోత్సవ సభలో రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్‌ను కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, చేస్తున్న కార్యక్రమాలు గురించి ఆయనకు వివరించినట్లు మల్లేశ్వరరావు తెలిపారు.

శిథిలమైన పాఠశాల భవనం

బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు

ప్రజాశక్తి - కురుపాం

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది గొటివాడ పంచాయతీ బల్లుకోట మండల పరిషత్ పాఠశాల పరిస్థితి. ఈ ఊరికి మొన్నటి వరకూ శాశ్వత రహదారి లేకపోవడంతో ఆ గ్రామ పాఠశాల నాడు.. నేడు పనులకు నోచుకోలేదు. దశాబ్దాల క్రితం పాఠశాల భవనం కావడంతో ప్రస్తుతం పెచ్చులూడిపడుతుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు సాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో నాడు నేడు మొదటి విడతలో నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో పనులు చేపట్టలేకపోయారు. ఫలితంగా నిధులు వెనక్కి మళ్లాయి. స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో ఇటీవల కొత్తగా బల్లుకోటకు బిటి రహదారి నిర్మాణం చేసి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చేశారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి శిథిల పాఠశాల భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న బల్లుకోట ప్రాథమిక పాఠశాల

ప్రజలపై భారాలు ఆపాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఆందోళన చేస్తున్న మహిళలు

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించి, ప్రజలపై మోపుతున్న భారాలు ఆపాలని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ మండలంలోని గైరమ్మపేట వద్ద ఐద్వా ప్రతినిధులు ఎం.అప్పలనరసింహ, కె.వరలక్ష్మి, సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరెంటు ఛార్జీలు విపరీతంగా పెంచిందని, భరించలేని పరిస్థితిలో ప్రజలు తట్టుకోలేకపోతున్నారని, సొంత ఇంట్లో ఉన్నా అద్దె ఇంట్లో ఉన్నట్టుగా ఉంటుందన్నారు. విద్యుత్‌ఛార్జీలు విపరీతంగా పెంచి అదానీ కంపెనీ లాభాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తోందన్నారు. ఇప్పటికే రూ.6వేల కోట్లు భారాలు వేసి ప్రజల దగ్గర కరెంటు ఛార్జీలు ముక్కు పిండి వసూలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యవసర ధరలన్నీ పెరిగి ప్రజలు భరించలేని పరిస్థితిలో ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల లాభాల కోసం అంబానీ, ఆదానీ లాభాలు కోసం తప్ప పేదలకు రైతాంగానికి ప్రజలకు ఎటువంటి భద్రత లేని విధానాల్ని అవలంబిస్తుందని అన్నారు. ఇప్పటికైనా పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించి ప్రజలపై భారాల ఆపాలని, లేకుంటే ప్రజాగ్రహానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులకు సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి - సీతానగరం

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆరోగ్య తనిఖీల కొరకు నిర్వహించిన ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఎ) కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గర్భిణులకు నిర్వహించిన వైద్య పరీక్షలను పరిశీలించారు. మాతా, శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసిన ఆరోగ్య వివరాలు పరిశీలించి, వైద్య పరీక్షల నివేదికలు అసాధారణంగా ఉన్న గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించాలని, వీరికి తగు చికిత్స అందజేసి పూర్తి స్థాయి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. రక్తహీనత, హైరిస్క్‌గా గుర్తించిన గర్భిణులు ఎంతమంది ఉన్నారని ఆరా తీశారు. అలాగే ప్రతి గర్భిణి ఐరన్, కాల్షియం మాత్రలు నిర్దేశించిన మోతాదులో వేస్తున్నదీ, లేనిదీ ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. టిడి వ్యాక్సిన్ రెండు డోసులు నెల వ్యవధిలో గర్భిణులందరికీ వేయాలన్నారు. కాన్పు సమయం దగ్గరగా ఉన్న గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రక్తహీనతగా ఉన్న గర్భిణులకు పిహెచ్‌సిలో ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ల ద్వారా చికిత్స కొరకు ఆసుపత్రికి చేర్చడానికి తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం వినియోగించాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు అక్కడ గర్భిణులతో మాట్లాడి వారికి గల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, సిహెచ్ఒ ఎస్వీ రమణ, సూపర్ వైజర్ భవాని, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.


టిడిపి నాయకులు వెంకటేష్‌ను అభినందిస్తున్న జనసేన నాయకులు

జనసేన - టిడిపి బలోపేతానికి ఉమ్మడి కార్యాచరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జనసేన-టిడిపిల బలోపేతానికి కృషి చేస్తామని జనసేన నాయకులు అన్నారు. ఇటీవల టిడిపి జిల్లా కార్యదర్శిగా నిమితులైన మజ్జి వెంకటేష్‌కు శనివారం జనసేన నాయకులు చందక అనిల్, గొర్లి చంటి, రాజాన రాంబాబు, మానేపల్లి ప్రవీణ్, సింగుమహంతి దినేష్, వంశీ తదితరులు అభినందనలు తెలుపుతూ దుస్సాలువాతో సత్కరించారు. అనంతరం. జనసేన - టిడిపి బలోపేతానికి ఇకపై చేయాల్సిన కార్యక్రమాలు, పోరాటాల గురించి , పట్టణంలో ఉన్న 30వార్డుల్లో పర్యటన, ప్రజా సమస్యల దిశగా ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశాలపైన చర్చించారు. అనంతరం ఇరు పార్టీ నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలంతా విసిగిపోయి ఉన్నారని, ఈ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందడానికి ప్రజలు కూడా ఎన్నికలు ఎప్పుడువస్తాయోనని ఎదురు చూస్తున్నారని అన్నారు. 2024లో ఉమ్మడి ప్రభుత్వం వస్తుందని, జనసేన - టీడీపీ ఉమ్మడి పార్టీ విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదని అన్నారు.

రోడ్లపైనే మురుగునీరు

ప్రజాశక్తి - పాలకొండ

రామకళామందిర్‌వీధిలో రోడ్డు ప్రవహిస్తున్న మురుగునీరు

స్థానిక నగర పంచాయతీలో మురికి కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ప్రధాన వీధులతో పాటు పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ప్రజలు ముక్కు మూసుకునే బయటకు రావాల్సిన పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలకావాల్సి వస్తుంది. రామకళామందిర్ వీధి దగ్గర రోడ్లపైనే మురికినీరు ప్రవహిస్తున్నా పట్టించుకోనే నాధుడు కరువయ్యారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విఆర్ఒలు, బిఎల్ఒల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ఎంవి రమణ

దరఖాస్తులను పరిశీలించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఓటు హక్కు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని తహశీల్దార్ ఎంవి రమణ బిఎల్ఒలకు సూచించారు. శనివారం తన కార్యాలయంలో బిఎల్ఒలు, విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న ఓటు నమోదుకు చివరి కావడం, వచ్చిన దరఖాస్తులను తీసుకోవాలని అన్ని పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉండాలన్నారు. ఓట్లు నమోదుతో పాటు చేర్పు, మార్పులు కూడా వచ్చిన దరఖాస్తులను తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, వివిధ గ్రామాల విఆర్ఒలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మండలంలోని కృష్ణరాయపురం, బూర్జ పోలింగ్ కేంద్రాలను శనివారం ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించే దిశగా జరుగుతుందన్నారు. అలాగే పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉందా, లేదని ముందుగా చూడడం జరుగుతుందన్నారు. అన్ని కేంద్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఎల్ఒలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - పాచిపెంట

తుపాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ డిమాండ్ చేశారు. మండలంలోని పనుకువలస వద్ద శనివారం తుపాను వల్ల నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఎకరా వరి పంటకు రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి నీట మునిగి రైతుకు తీవ్ర నష్టాన్ని తుఫాను మిగిల్చిందని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, గూడెపు యుగంధర్, కొత్తల పోలినాయుడు, గొర్ల సత్యం, రౌతు తిరుపతిరావు, దండి మోహనరావు, కొట్యాడ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

గౌడ సామాజిక తరగతికి అండగా వైసిపి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

గౌడ సామాజిక వర్గానికి అండగా వైసిపి ప్రభుత్వం నిలుస్తుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జిల్లా కేంద్రంలో గల పెన్షనర్స్ భవనంలో శనివారం శ్రీ గోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వారందరితో కలిసి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాలు అందరికీ వడ్డించారు. కార్తీక సమారాధన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు తమ సంఘం తరఫున కుల పెద్ద డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న తమ సంఘం ప్రజలందరి ఆశయాన్ని మీ ద్వారా నేడు నెరవేరబోతుండడం అందరికీ చాలా సంతోషంగా ఉందని, మీ సహకారంతో తామంతా కలిసి శ్రీకృష్ణ జ్ఞానమందిరం నిర్మాణం చేసుకోవడం జరుగుతుందని, త్వరలోనే ఆయన చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే ఈనాటి గొప్ప కార్యక్రమానికి తనకు ఆహ్వానం పలికడం ఆనందంగా ఉందని, మీరంతా ఎంతగానో ఎదురు చూసిన శ్రీకృష్ణ జ్ఞానమందిరం నేడు ఈ పక్కనే నిర్మాణం చేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. మీరంతా కోరుకున్నట్లు మందిరం నిర్మాణానికి చెందిన పొజీసన్ పట్టాను మీ అందరి సమక్షంలో ఎమ్మెల్యే కుల సంఘం పెద్దలకు పట్టాను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, సీనియర్ నాయకులు బత్తుల శ్రీదేవి, బత్తుల నగేష్, బత్తుల శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ సభ్యులు ఎడ్ల త్రినాధ, సర్పంచ్ జక్కు ప్రవీణ్ కుమార్, యాదవ సంఘం పెద్దలు, పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఇఇపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న పాత్రికేయులు

ఉద్యోగుల అక్రమ బదిలీలపై వివరణ కోరిన జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన విద్యుత్ శాఖ ఇఇ వివి కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శాఖా పరమైన బదిలీల్లో తనకు అన్యాయం చేశారని, యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ఆందోళన చేయడంతో దీనికి సంబంధించిన వార్త సేకరణ నిమిత్తం, ఎపిఇపిడిసిఎల్ ఇఇ వి.వి కిషోర్‌ను వివరణ కోరారు. దీంతో ఆయన విలేకర్లపై దురుసుగా ప్రవర్తించి, బయటకు పోవాలని నెట్టి వేసి గట్టిగా కేకలు వేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. అనంతరం శనివారం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వినతిపత్రం అందజేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికలకు, చానళ్ల జర్నలిస్టులు పాల్గొన్నారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

జర్నలిస్టులపై విద్యుత్‌శాఖ ఇఇకిషోర్ అనుచితంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో జరిగిన అక్రమ బదిలీల ఆరోపణల పై వివరణ కోరినందుకుగాను జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించడం అధికారులకు తగదన్నారు. తప్పు చేయకపోతే అంతటి అసహనానికి గురి కావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. జిల్లా అధికా రులు ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యుడైన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శిక్షణలో మాట్లాడుతున్న సర్పంచ్ అమల

మండలంలోని గొరడలో శనివారం వల్లాడ, పెంగవ, రాయగడ జమ్ము, గొరడ గ్రామాలకు చెందిన జీవ రైతుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయగడ జమ్ము సర్పంచి పత్తిక అమల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గిపోవడం, ఆరోగ్యాలు క్షీణించడం, సకాలంలో ఋతువులు రాకపోవడం, పని చేయడానికి అనాసక్తిగా కలగడం తదితర లక్షణాలు ఎక్కువమందిలో కనిపిస్తున్నాయన్నారు. ఇందుకు కారణం రసాయనిక ఎరువులు, పురుగుమందులు ఉపయోగించి పండించిన ఆహార పదార్థాలు తినడం వల్ల అలాంటి సమస్యలతో సతమతమవుతుండడం జరుగుతుందన్నారు. వీటన్నింటికీ ఒకే ఒక పరిష్కారం ప్రకృతి వ్యవసాయం చేయడమేనని తెలిపారు. నాబార్డు ద్వారా ఈ ప్రాంతంలో జీవా కార్యక్రమం అమలు చేయడం సంతోషదాయకమన్నారు. ఆర్.జమ్ము పంచాయతీ పరిధిలో నాలుగు గ్రామాల్లో నాబార్డు సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో జీవ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం నిజంగా ఆనందించదగ్గ విషయమని, రైతులు వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు చేయడం ద్వారా త్వరితగతిగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షులు తాడంగి జమ్మయ్య మాట్లాడుతూ గిరిజనులు పూర్వం కాలం నుంచి వస్తున్న ఆచార సాంప్రదాయాలను వ్యవసాయ రంగంలో ఆచరించాలని సహజంగా లభించే వనరులను ఉపయోగించుకోవడం వల్ల భూమిని సారవంతం చేసుకుంటే పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా పశుసంపద ప్రతి ఇంటిలో ఉండాలని అప్పుడే కుటుంబాలతో పాటు, క్షేత్రాలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రిసోర్స్‌పర్సన్ నూకం నాయుడు జీడి, మామిడిలో దిగుబడి పెరిగేందుకు చేపట్టే ప్రకృతి సాగు విధానాలు, రబీలో చేపట్టే సస్యరక్షణ కార్యక్రమాలు, నేలను సారం చేసే విధానాలు, పలు పంటలు, అంతర పంటలు, డ్రై సోయింగ్, వివిధ పంటల నమూనాలు సాగు మొదలైన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ అధ్యక్షులు టి.జమ్మయ్య, కార్యదర్శి కె.చిరంజీవి, జీవా కో-ఆర్డినేటర్ జి.ప్రొబోద్, ఆది తల్లి సిఇఒ పేకాపు మురళి, కోఆర్డినేటర్ జి.మురళీమోహన్, ఎస్‌సిఆర్‌పి యశోదా దేవి, విడిసి అధ్యక్షులు పువ్వుల గౌరయ్య, జీవా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఇంట్లో చోరీ

ప్రజాశక్తి, పాలకొండ

చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

పాలకొండలో శనివారం పోలీసు ఇళ్లల్లో దొంగతనాలు జరిగినట్లు సమాచారం బయటకు వచ్చింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో ఉంటున్న దిశ ఎస్ఐ ఇంట్లో దొంగలు చొరబడి రూ.30వేలు నగదు, తులం బంగారం అపహరించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో, తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఎస్ఐ తల్లి రూప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగి కాంతారావు క్యాంపులు ఉండగా ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న లక్ష రూపాయల నగదు, అరతులం బంగారం దొంగలు అపహరించారు. ఎస్.ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఇళ్ల స్థలాల అక్రమాలపై చర్యలు తీసుకోండి

౦౦౦ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, బొబ్బిలి, బాడంగి మండలాల కార్యదర్శులు ఎస్.గోపాలం, ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణకు గురైన ఇళ్ల స్థలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో అధికార పార్టీకి చెందిన వార్డు ఇన్‌ఛార్జి ఇళ్ల స్థలాలను ఆక్రమించేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు అక్రమాలపై దర్యాప్తు చేసిన రెవెన్యూ అధికారులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తేవడంతో అర్థాంతరంగా దర్యాప్తు నిలిపివేశారని మండిపడ్డారు. ఒక్కొక్కటి రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఇళ్ల స్థలాల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.